క్లుప్తంగా

ఆర్ఐగా రాజశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయంలో ఆర్ఐ (రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్)గా రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా ఏఆర్ విభాగంలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఈయన ఆర్ఐగా పదోన్నతి పొంది శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. సత్యసాయి జిల్లాలో ఆర్ఐగా పని చేస్తున్న శ్రీశైలం రెడ్డి కడపకు బదిలీ అయ్యారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డిని ఆర్ఐగా రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం



హెచ్‌ఎం అబ్దుల్ రహిమాన్, పీడీ నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఇటీవల రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ రహిమాన్, జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారం అందుకున్న బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల పీడీ నాగరాజును శుక్రవారం బుక్కపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, ఎంఈఓ గోపాల్‌నాయక్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

గాండ్లపెంట: ప్రభుత్వ వనరులను సద్వినియోగం చేసుకుని, సమష్టిగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, కదిరి అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిమోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో స్వశక్తీకరణ, ప్రభుత్వ వనరుల సద్వినియోగంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. తలుపుల మండలానికి సంబంధించి 200 మందికి గ్రామ స్థాయి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధిలో ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, ట్రైనర్ నిరంజన్, ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ, ఏటీఎల్ కృష్ణ పాల్గొన్నారు.

మసీదుకు రూ.లక్ష విరాళం

తనకల్లు: మండల పరిధిలోని దుగినేపల్లి మసీదుకు మాజీ సర్పంచ్ మస్తాన్‌వలి శుక్రవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. మసీదు అభివృద్ధికి ఆర్థిక చేయూత అందించిన మస్తాన్‌వలికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం బుక్కపట్నంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. లేఅవుట్లలో ఇప్పటి దాకా ఇంటి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. వెంటనే పునాదులు వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఆదినారాయణ, పార్వతి, తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఏఓ సతీష్, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం



ఎన్పీకుంట: ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న యువకులు



ఎన్పీకుంట: నిమజ్జనానికి తరలిన గణనాథుడు



నల్లమాడ: వినాయకుడి ఊరేగింపులో యువకుల సందడి

నల్లమాడ: మండల కేంద్రంలో శుక్రవారం గణేష్ నిమజ్జనం కోలాహలంగా సాగింది. వినాయక చవితిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయకులకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులకట్ట వీధి, పంచాయతీ కార్యాలయం ఎదురుగా, బెస్తవీధి, గంగా థియేటర్ వీధి, ఎస్సీ కాలనీ తదితర చోట్ల కొలువుదీర్చిన వినాయకుడి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో డప్పు వాయిద్యాలు, బాణా సంచా పేలుళ్లతో పురవీధుల్లో ఊరేగించారు. యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ డప్పు వాయిద్యాలకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ ముందుకు సాగారు. ఎస్సీ కాలనీవాసుల కీలుగుర్రం వేషధారణ ఆకట్టుకుంది. అనంతరం కొర్లకుంట, బొగ్గలపల్లి సమీపంలోని జమాల్‌ఖాన్ పెద్ద చెరువులో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పీర్ల చావిడి వద్ద ఓంకార గణపతి మిత్రమండలి, కల్లంగడి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుల నిమజ్జనం వేడుకగా సాగింది. పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమాన్ని సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఉట్టి కొట్టేందుకు పెద్ద ఎత్తున యువకులు పోటీపడ్డారు. అనంతరం విజేతకు రూ.2,116 నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం గణపయ్యను ట్రాక్టర్‌లో మండల కేంద్రంలో వీధుల్లో ఊరేగించారు. డప్పు, వాయిద్యాలతో బాణసంచా పేల్చుతూ, రంగులు చల్లుకుంటూ యువకులు సందడి చేశారు. వెలిగల్లు జలాశయంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

రూ.1,05,000 పలికిన లడ్డూ

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని చావిడి వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూను వేలం వేశారు. మండల కేంద్రానికి చెందిన గణేష్‌రెడ్డి రూ.1,05,000లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా లడ్డూ వేలం

ధర్మవరం రూరల్: పట్టణంలోని చంద్రబాబు నగర్‌లో వినాయక చవితి వేడుకలను కాలనీ వాసులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం వినాయకుడి లడ్డూను గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. నారాయణస్వామి నాయక్ అనే ఉపాధ్యాయుడు రూ.2,07,000లకు లడ్డూను దక్కించుకున్నారు.





ఎన్పీకుంట: లడ్డూ కోసం వేలం పాట, ధర్మవరం రూరల్: లడ్డూ దక్కించుకున్న ఉపాధ్యాయుడు

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

అమడగూరు: మండలంలోని పూలకుంటపల్లి సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని సుబ్బరాయనిపల్లి, ఇరగరాజుపల్లిలో అంగన్‌వాడీ వర్కర్, బ్రాహ్మణపల్లిలో మినీ వర్కర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పుట్టపర్తి సీడీపీఓ గాయత్రి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు 10వ తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 29 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను పుట్టపర్తి సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. సుబ్బరాయనిపల్లి వర్కర్ పోస్టు నియామకానికి సంబంధించి కేసు కోర్టు విచారణ దశలో ఉందన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా తాత్కాలిక నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు.

రేపు పోలా రామాంజినేయులు సంస్మరణ సభ

ధర్మవరం రూరల్: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పోలా రామాంజినేయులు సంస్మరణ సభను ఈనెల 24న స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, నామాల నాగార్జున, ఎస్‌హెచ్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గృహసారథుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి

ప్రశాంతి నిలయం: గృహసారథుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి జేసీఎస్ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహసారథులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి గృహసారథికి ప్రయోజనం చేకూరేలా వారి వివరాలను జేసీఎస్ యాప్‌లో కన్వీనర్లు నమోదు చేయాలని సూచించారు. ఈనెల 25లోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు. అనంతరం జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ మారుతీ రెడ్డి మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా యాప్‌లో గృహసారథుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. అందులో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల జేసీఎస్ కన్వీనర్లు సూర్యాగౌడ్, మల్లికార్జున, గోవర్ధన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, ఆనంద రెడ్డి, జయప్ప, సచివాలయ కన్వీనర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్తను అవమానించిన తహసీల్దార్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అంబేడ్కర్ కాలనీవాసులు

ఎన్పీకుంట: ఎన్.పీ.కుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ అంజినమ్మ భర్త శ్రీరాములును తహసీల్దార్ నరేంద్రకుమార్ అవమానించారు. శుక్రవారం సాయంత్రం ప్రజా సమస్యలపై చర్చించేందుకు వెళ్లిన శ్రీరాములును బయటకి వెళ్లిపో అంటూ తహసీల్దార్ నోరు పారేసుకున్నారు. విషయం తెలుసుకున్న అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల దృష్ట్యా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే నిర్దాక్షిణ్యంగా బయటికి వెళ్లు అని చెప్పడం సరికాదన్నారు. దళితులమనే చిన్నచూపుతో ఇలా ప్రవర్తించారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఘటనపై ఆరా తీశారు. ప్రజా ప్రతినిధులతో అలా ప్రవర్తించడం సరికాదని తహసీల్దార్‌కు సూచించారు. అనంతరం సర్పంచ్ భర్త శ్రీరాములుకు తహసీల్దార్ నరేంద్రకుమార్ క్షమాపణ చెప్పడంతో ఇరువర్గాలు శాంతించాయి.

దేశ నాయకుల చిత్రపటాల వితరణ

పుట్టపర్తి అర్బన్: మండలంలోని బీడుపల్లి ఉన్నత పాఠశాలకు పలువురు దేశ నాయకుల చిత్రపటాలను పోస్టల్ ఉద్యోగి అల్లాబకాష్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధిక, బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ సౌజన్య కుమారి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కుణుతూరు, పోతుకుంట, నిమ్మలకుంట గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వేను శుక్రవారం ఎంపీడీఓ సౌజన్యకుమారి తనిఖీ చేశారు. సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిమ్మలకుంట పాఠశాలను సందర్శించారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



మామిళ్లపల్లి వద్ద భూముల రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్

కనగానపల్లి: రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్ అన్నారు. వందేళ్ల తర్వాత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంతో భూముల హద్దు కొలతలు పక్కాగా నమోదు చేయబడతాయన్నారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రీ సర్వే జరుగుతున్న పొలాల్లోకి వెళ్లి సర్వే సిబ్బందితో కలిసి రికార్డుల ప్రకారం భూముల హద్దులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. రైతులు పొలాల గట్లు, కొలతల కచ్చితత్వాన్ని నిర్ధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డివిజినల్ సర్వే అధికారులు, గ్రామ సర్వేయర్ రామతులసి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వెంకటగారిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: మండలంలోని 13 పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వ్యర్థాలు లేని పంచాయతీలుగా రూపొందించేందుకు శుక్రవారం వెంకటగారిపల్లిలో ర్యాలీ చేపట్టారు. ప్రజలు, సిబ్బందితో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ , వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, ఫ్లూ, డయేరియాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఈ శశి, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శానిటేషన్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రమదానం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వంగడాలతో అధిక దిగుబడి



వేపకుంటలో సాగుచేసిన ఆముదం పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు

కనగానపల్లి: నూతన రకం ఆముదం వంగడాలతో అధిక దిగుబడి సాధించొచ్చని జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు పవన్‌కుమార్‌రెడ్డి, రాధిక రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వేపకుంట గ్రామంలో వారు పర్యటించి, ఆముదం పంటలు పరిశీలించారు. ముఖ్యంగా ఆముదంలో కొత్త వంగడమైన ఐసీహెచ్- 5 రకం పంట సాగు ప్రథమ శ్రేణి క్షేత్రాలను సందర్శించారు. స్థానిక పోతిరెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆముదం పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఆముదంలో ఐసీహెచ్- 5 రకం పంట బెట్టను తట్టుకునే శక్తి ఉండటంతో పాటు చీడపీడలు కూడా పెద్దగా వ్యాపించవన్నారు. ఇలాంటి మేలు రకం వంగడాలను రైతులు ఎన్నుకుంటే రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించొచ్చన్నారు. ఈ పంటలను పరిశీలించేందుకు వచ్చే నెల 4న జాతీయ స్థాయిలో పనిచేసే కొందరు వ్యవసాయ శాస్త్రవేత్తలు వస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త దుర్గాప్రసాద్, వీఏఓ లక్ష్మీనారాయణ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

29న మహాధర్నా

పుట్టపర్తి టౌన్: విజయవాడలో ఈనెల 29న దళిత వ్యతిరేక విధానాలకు నిరసనగా జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు ఇంతియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటరానితనాన్ని నిర్మూలించాలని కోరారు. డప్పు, చర్మ కళాకారులకు రూ.5 వేల పింఛన్ అమలు చేయాలన్నారు. భూమిలేని దళితులకు 3 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. నాయకులు హనుమయ్య, రమణ, సిద్ధూ పాల్గొన్నారు.

నేడు రాధాష్టమి వేడుకలు

అనంతపురం కల్చరల్: రాధాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో శనివారం వేడుకలు జరుగనున్నాయి. ఈ మేరకు మందిరంలో జరిగిన సమావేశంలో ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగదాసు వివరాలు వెల్లడించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పుష్పాలంకార సేవ, వసంత శోభ, సామూహిక కృష్ణ నామసంకీర్తన, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఇద్దరికి గాయాలు





గాయపడిన విజయ్ , బాబేనాయక్

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కదిరి-రాయచోటి రహదారిపై శుక్రవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కదిరి నుంచి విజయ్ అనే యువకుడు ఎన్పీకుంట వైపునకు వెళ్తుండగా.. తలుపుల మండలం చంద్రానాయక్ తండాకు చెందిన బాబేనాయక్ ద్విచక్ర వాహనంలో ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్, బాబేనాయక్ ఇద్దరూ గాయపడ్డారు. పోలీసులు వీరిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తక్షణసాయం అందజేత



వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద నగదు అందజేస్తున్న సర్పంచ్ పంచరత్నమ్మ

నల్లచెరువు: మండల పరిధిలోని కుంట్లపల్లివారిపల్లికి చెందిన రఘునాథ (35) ఈనెల 19వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేల నగదును మృతుడి భార్య వెంకటరమణమ్మకు సర్పంచ్ పంచరత్నమ్మ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసుంధర, వెల్ఫేర్ అసిస్టెంట్ నూరుద్దీన్, వలంటీర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

విభిన్న 'ప్రతిభా'వంతులకు అభినందన

హిందూపురం టౌన్: జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు శుక్రవారం స్థానిక ఎంజీఎం పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. పుట్టపర్తిలో గురువారం జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో రన్నింగ్ రేస్‌లో విభిన్న ప్రతిభావంతురాలు సుహాన తృతీయ స్థానం, షాట్‌పుట్ అండ్ రన్నింగ్ రేస్‌లో ఆజామ్ తృతీయ, అలాగే పునీత్ కుమార్, సుఫియాన్‌లు విజేతలుగా నిలవడంతో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, కౌన్సిలర్ రమేష్ వారిని సత్కరించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంజీఎం, దుర్గాబాయి దేశ్‌ముఖ్, పొట్టిశ్రీరాములు పాఠశాలల హెచ్‌ఎంలు సామ్రాజ్యం, రమాదేవి, సూర్యనారాయణ, భవిత పాఠశాల ఐఈఆర్టీ లలిత పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



అనధికారికంగా వేసిన పునాదులను పరిశీలిస్తున్న ఎంపీపీ, మండల అధికారులు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌కు వెళ్లే దారిలోని ప్రభుత్వ భూమిలో దురాక్రమణలను శుక్రవారం ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 768, 769లోని జగనన్న లేఅవుట్‌లో సుమారు 224 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. జగనన్న లేఅవుట్‌కు వెళ్లేందుకు సర్వే నంబరు 766లో రస్తా ఉందని తెలిపారు. అయితే ఈ రస్తాలో చాలా మంది అనధికారికంగా దురాక్రమణలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వారం రోజుల క్రితం మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి పర్యటించిన సందర్భంలో పలువురు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో దురాక్రమణలకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు వేసిన పునాదులను తొలగించి రస్తా సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌నాయుడు, మండల సర్వేయర్ అశోక్, సచివాలయ సిబ్బంది, నాయకులు షామీర్‌బాషా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు సహకరించండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్

హిందూపురం టౌన్: హిందూపురం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల మార్పులు, పేర్ల మార్పునకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జేసీ మాట్లాడుతూ హిందూపురం మండల పరిధిలో 1, అర్బన్‌లో 13, లేపాక్షి మండలంలో 2, చిలమత్తూరు మండలంలో 2 పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నామన్నారు. అలాగే హిందూపురం రూరల్‌లో 2, చిలమత్తూరు మండలంలో 14 పోలింగ్ కేంద్రాల పేర్లను మార్పు చేస్తున్నామని తెలిపారు. త్వరితగతిన ఈ ప్రక్రియ ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఎన్నికల సీఏ శ్రీనివాసరెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.